నమస్తే తెలంగాణ



## ప్రభుత్వ కళాశాల కోసం పని చేసినా దక్కని గౌరవం

కుంటాల, అక్టోబర్ 20 : కళాశాల ప్రారంభమైన నాటి నుంచి సేవలు అందిస్తున్న తమకు ఇటీవల వెలువడిన గెస్ట్ లెక్చరర్స్ నోటిఫికేషన్ రద్దు చేసి న్యాయం చేయాలని కుంటాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రస్తుతం కళాశాల అభివృద్ధి కమిటీ నుంచి ఎంపికై పని చేస్తున్న తాత్కాలిక అధ్యాపకులు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఇన్ని రోజులు ఉచితంగా బోధన చేస్తున్న తమకు ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ సంయుక్త సంచాలకులు రిక్రూట్మెంట్ గైడ్‌లైన్స్‌లో త్యాగాలు చేసి ప్రస్తుతం సేవలు అందిస్తున్న స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యత ఇస్తామని చెప్పినా అదేవిధంగా మౌఖికంగా డీఐఈవో కు ఆదేశాలు ఇచ్చినా డీఐఈవో పరశురాం తన పై అధికారి (ఆర్‌జేడీ) ఆదేశాలను బేఖాతరు చేసి కలెక్టర్‌ను తప్పుదోవ పట్టించారని అభ్యర్థులు ఆరోపించారు. కళాశాల ప్రిన్సిపల్, జిల్లా అధికారి సమన్వయ లోపంతో మాకు నష్టం జరిగేలా ఉందని పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలను పాటించక హడావుడిగా నోటిఫికేషన్ ఇచ్చిన డీఐఈవో పై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇక్కడ తాత్కాలిక అధ్యాపులు తెడ్డు రమేశ్, పద్మ, గోదావరి, గజేందర్, సురేశ్ ఉన్నారు.

## మూఢనమ్మకాలకు దూరం చేసేందుకు కృషి

ఎదులాపురం, అక్టోబర్ 20 : విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన పెంచడంతో పాటు మూఢ నమ్మకాలను దూరం చేయడానికి జన విజ్ఞాన వేదిక కృషి చేస్తున్నదని ఆ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజు అన్నారు. నవంబర్ నుంచి ప్రారంభించే చెకుముఖి సైన్స్ సంబురాలకు గాను రాష్ట్ర స్థాయి ఆహ్వాన సంఘం ఏర్పాటుకు ఆదివారం ఆదిలాబాద్‌లోని డైట్ కళాశాలలో సమావేశం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ఆయన మండల, జిల్లా, స్థాయిలో నిర్వహించే చెకుముఖి సైన్స్ సంబురాల తేదీలను తెలిపారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజు మాట్లాడుతూ పిల్లల్లో సైన్స్ పరిజ్ఞానం పెంచే దిశగా తాము కృషి చేస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగానే సార్ సీవీ రమణ్ జయంతి పురస్కరించుకొని నవంబర్ 7న పాఠశాల స్థాయి చెకుముఖి సైన్స్ పోటీలను ప్రారంభిస్తున్నామన్నారు. 21న మండల, 28న జిల్లా స్థాయి పోటీలుంటాయని తెలిపారు. ఇక్కడ గెలుపొందిన వారిని డిసెంబర్ 14 నుంచి 16వ తేదీ వరకు ఆదిలాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఈ పోటీలకు 33 జిల్లాల నుంచి విద్యార్థులు వస్తారన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు చెలిమిల రాజేశ్వర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వరప్రసాద్, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఉమాకాంత్, ఊశన్న, ప్రైవేట్ స్కూల్ యజమాన్యల సంఘం అధ్యక్షుడు రంగినేని పవన్‌రావ్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు స్వామి, శ్రీకాంత్, పార్థసారథి, సొగల సుదర్శన్, ఇంజినీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నదానం జగదీశ్వర్, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

## భైంసా మార్కెట్‌లో నిలువు దోపిడీ

### మితిమీరిపోతున్న కమీషన్ ఏజెంట్లు



గాంధీగంజ్‌లో అమ్మకానికి తీసుకువచ్చిన సోయాబీన్

భైంసా, అక్టోబర్ 20 : భైంసా మార్కెట్‌లో రైతులకు నిలువు దోపిడీ జరుగుతున్నది. ముథోల్ నియోజకవర్గంలో సోయా పంట ఎక్కువ పండడంతో అమ్మకానికి రైతులు మార్కెట్‌కు తీసుకువస్తే కొనుగోలు దారులు, కమీషన్ ఏజెంట్లు వారిని నిలవునా దోచుకుంటున్నారు. సోయా కొనుగోళ్లలో క్వింటాల్‌కు 2 కిలోల కోత విధిస్తూ రైతులను దోచుకుంటున్నారు. వ్యాపారులు సిండికెట్‌గా మారి ధరను తగ్గిస్తున్నట్లు ఆరోపణలు రైతుల నుంచి వినిపిస్తున్నాయి. దీనికి తోడు రైతుల పంటకు తూకం వేయాలంటే మార్కెట్ అధికారులు మార్కెట్ కాంటాలు ఏర్పాటు చేయాలి. నిబంధనలకు విరుద్ధంగా కమీషన్ ఏజెంట్లు తమ దుకాణాల ముందు సొంత కాంటాలను ఏర్పాటు చేసి తూకంలో మోసం చేస్తున్నారన్న ఆరోపణలు సైతం ఉన్నాయి. అదేవిధంగా మార్కెట్ కమిటీ దడ్వాయిల ప్రమేయం లేకుండా తూకం వేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతులకు న్యాయం చేయాలని పలువురు కోరుతున్నారు.

# కేటీఆర్ సభను విజయవంతం చేయాలి

### మాజీ మంత్రి జోగు రామన్న



పోస్టర్ విడుదల చేస్తున్న మాజీమంత్రి జోగు రామన్న, నాయకులు

ఎదులాపురం, అక్టోబర్ 20: ఎన్నికల సమయంలో సీఎం రేవంత్ రెడ్డి సామాన్య ప్రజానీకానికి ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని మాజీమంత్రి జోగు రామన్న మండిపడ్డారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ నెల 24వ తేదీన ఆదిలాబాద్‌లో నిర్వహించనున్న సభకు హాజరుకానున్న నేపథ్యంలో ఊరువాడ పార్టీ నేతలు విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఈ నేపథ్యంలో పట్టణంలోని మహాలక్ష్మీ వాడల్లో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో మాజీమంత్రి జోగు రామన్న పాల్గొని శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపాల్సిన బాధ్యత ప్రధాన ప్రతిపక్షంపై ఉందన్నారు. ఇందులో భాగంగానే కేటీఆర్ జిల్లాలో పర్యటించి సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతులకు రుణమాఫీ, రైతు భరోసా వంటి పథకాల విషయంలో ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తోందన్నారు. బీఆర్ఎస్ హయాంలో ప్రగతి పథంలో సాగిన తెలంగాణ ప్రస్తుతం తిరోగమన బాటలోనడుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అన్నదాతలకు న్యాయం జరిగేంత వరకు వారికి అండగా నిలుస్తామని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు అలాల్ అజయ్, సాజిదొద్దీన్, అశోక్ స్వామి, పందిరి భూమన్న, కొండ గణేశ్, రామేశ్వర్, కోవ రవి, నల్ల మహేందర్, పర్వీన్, యమున, సాయికిరణ్, తదితరులు పాల్గొన్నారు.

# హీరాపూర్‌లో కుమ్రం భీం విగ్రహావిష్కరణ



ఇంద్రవెల్లి: హీరాపూర్‌లో కుమ్రం భీం విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్

ఇంద్రవెల్లి, అక్టోబర్ 20: హీరాపూర్ గ్రామంలో ఆదివాసీ గిరిజనుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుమ్రం భీం విగ్రహాన్ని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ ఆవిష్కరించారు. ముందుగా గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. ఆదివాసీ గిరిజనుల సంస్కృతీ సంప్రదాయ ప్రకారం ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేసి కుమ్రం భీం విగ్రహాన్ని ఆవిష్కరించారు. జెండా వద్దకు పూజలు చేసి జెండాను ఆవిష్కరించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ కుమ్రం భీంను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

### మారుమూల గ్రామాలభివృద్ధికి చర్యలు

మారుమూల గ్రామాలభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. ఆదివారం డొంగర్‌గాం గ్రామానికి మొదటి సారిగా వచ్చిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్‌కు ఆదివాసీ గిరిజనులు ఘనంగా స్వాగతం పలికారు. గ్రామపెద్దలు, మహిళలు, యువత ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాతో సన్మానించారు. గ్రామంలో నెలకొన్న వివిధ సమస్యలపై వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో గ్రామపటేల్ పెందూర్ బాదుపటేల్, పెందూర్ బండు, రాము, భీంరావ్, మడావి లచ్చుపటేల్, సురేశ్ పాల్గొన్నారు.

### కుమ్రం భీం పోరాటం స్ఫూర్తిదాయకం

ఖానాపూర్, అక్టోబర్ 20 : ఆదివాసీల హక్కుల కోసం కుమ్రం భీం చేసిన పోరాటం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం ఖానాపూర్‌లో నిర్వహించిన భీం వర్ధంతికి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, మున్సిపల్ చైర్మన్ రాజురా సత్యం, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ముందుగా పలు గ్రామాల నుంచి తరలివచ్చిన గిరిజనలతో కలిసి వారి కుల దేవతలకు, జెండాలకు పూజలు చేశారు. కుమ్రం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అంకుశ్‌రావ్, లింగు, భీంరావ్, పలు ఆదివాసీ గూడాల పటేళ్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు



అమ్మవారిని దర్శించుకుంటున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ దంపతులు

బాసర, అక్టోబర్ 20 : సరస్వతీ అమ్మవారిని ఆదివారం ప్రముఖులు దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆర్జేడీ సత్యనారాయణను అధికారులు ఘనంగా ఆహ్వానించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కలెక్టర్ అభిలాష అభినవ్ దంపతులు అమ్మవారి దర్శనానికి విచ్చేయగా అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకొని కుంకుమార్చన పూజలు నిర్వహించారు. వీరికి అర్చకులు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

### అట్రాసిటీ కేసులో ఒకరి అరెస్ట్

ఎదులాపురం, అక్టోబర్ 20: ఆదిలాబాద్ రూరల్ మండలం రామాయి వద్ద 13న జరిగిన దాడి కేసులో 8మందితోపాటు మరికొందరిపై అట్రాసిటీ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. రామాయికి చెందిన జిట్టా ప్రభాకర్, జిట్టా రత్నాకర్, అనిల్, ఈశ్వర్, జ్ఞానేశ్వర్, ఇస్తారి, దత్తు, శ్యాం బోయితో పాటు కేసు ఉన్న వారు పరారీలో ఉన్నారు. ఆదివారం శ్యాంబోయి అలీయాస్ మన్ని శ్యాం సుందర్‌ను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ జీవన్ రెడ్డి తెలిపారు. మిగతా వారి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

### ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఉట్నూర్ రూరల్, అక్టోబర్ 20 : మండలంలోని గిరిజన ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లో 2024 సంవత్సరానికి గాను ఏడో విడుత వాక్ ఇన్ అడ్మిషన్ కొరకు అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ఆర్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో చేరుటకు 8, 10వ తరగతి ఉత్తీర్ణులై, 01 ఆగస్టు 2024 నాటికి 14 సంవత్సరాలు నిండిన వారు https://iti.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 18 నుంచి 30వ తేదీ వరకు 3 గంటల లోపు ఒరిజిల్ సర్టిఫికెట్లు స్కాన్ చేసి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం కళాశాలలో రిపోర్టు చేయాలని తెలిపారు. అదేవిధంగా గత 6 విడుతలలో అడ్మిషన్ పొందిన విద్యార్థులు అర్హులు కారని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 9491460060 నంబర్‌కు ఫోన్ చేయాలని పేర్కొన్నారు.

### నర్సింహా స్వామి ఆలయంలో చోరీ



నర్సింహాస్వామి ఆలయంలో నుంచి నగదు ఎత్తుకెళ్లిన దుండగులు

భైంసా, అక్టోబర్ 20 : భైంసా పట్టణంలోని నర్సింహా స్వామి ఆలయంలో ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆలయ నిర్వాహకులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్సింహస్వామికి అలంకరించిన 3.5 కిలోల వెండి, మకర తోరణంతోపాటు 29 తులాల బంగారు కిరీటాన్ని దొంగలు ఎత్తుకెళ్లిపోయారు. అంతేగాకుండా గర్భగుడి ఎదుట గల హుండీని కింది భాగం నుంచి పగల గొట్టి భక్తులు సమర్పించిన నగదును కూడా ఎత్తుకెళ్లారు. ఘటనా స్థలాన్ని భైంసా ఏఎస్పీ అవినాశ్ కుమార్, పట్టణ సీఐ గోపీనాథ్‌లు సందర్శించి వివరాలను సేకరిస్తున్నారు.

### నేటి నుంచి పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలు

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 20 : ఈ నెల 21వ తేదీ నుంచి పోలీస్ అమరవీరుల సంస్మరణ (పోలీస్ ఫ్లాగ్‌డే) కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎస్పీ డా. జానకీ షర్మిల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ భాషల్లో విద్యార్థులకు ఆన్‌లైన్‌లో వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

### పోలీసుల లాఠీచార్జీని నిరసిస్తూ శాంతియుత నిరసన

నర్సాపూర్(జీ)/దిలావర్‌పూర్, అక్టోబర్ 20 : సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయాన్ని ధ్వంసం చేసిన వారిని శిక్షించాలంటూ శాంతియుత నిరసన చేస్తున్నటువంటి హిందూ సంఘాలపై పోలీసుల లాఠీ చార్జిని నిరసిస్తూ నర్సాపూర్(జీ)లో జాతీయ రహదారి 61పై, దిలావర్‌పూర్‌లో నిర్మల్ భైంసా 61వజాతీయ రహదారిపై హిందూ సంఘాలు, హిందువాహిని, బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో హిందూ సంఘాల నాయకులు నరేందర్, నవీన్, పల్లపు రాజు, సాయికృష్ణ, గంగారాం, రాజు, అశోక్, మహేశ్, విజయ్, రవి, హిందువాహిని బీజేపీ నాయకులు శైలేశ్వర్, ఉదయ్‌గౌడ్ పాల్గొన్నారు.

# రాబడి

## బిల్లుల భారం తగ్గేదెలా?

### క్రెడిట్ కార్డ్ బకాయిల చెల్లింపులకు దారులివీ..

క్రెడిట్ కార్డుల్ని సవ్యంగా వినియోగిస్తే వాటితో ఎన్నో లాభాలుంటాయి. ఆర్థిక పరిస్థితుల నిర్వహణలో వీటి పాత్ర ఎంతో ప్రభావవంతం. కానీ దురదృష్టవశాత్తూ చాలామంది ఈ క్రెడిట్ కార్డుల వాడకంతో మితిమీరిన ఖర్చుల వలయంలో చిక్కుకుంటున్నారు. ఈ క్రమంలోనే బిల్లులను చెల్లించలేని దుస్థితికి చేరుకుంటున్నారు. అయితే భారమైన క్రెడిట్ కార్డ్ బిల్లు చెల్లింపులకు కొన్ని మార్గాలున్నాయి. వాటిలో..

#### ఈఎంఐల్లోకి మార్చడం

చాలా క్రెడిట్ కార్డు సంస్థలు బకాయిలను ఈఎంఐల్లోకి మార్చుకునే సౌకర్యం వినియోగదారులకు ఇస్తున్నాయి. నిజానికి మెజారిటీ బ్యాంకులు ఈ సదుపాయాన్ని ఉచితంగానే కార్డుదారులకు అందిస్తున్నాయి. దీనివల్ల ఒకేసారి పెద్ద మొత్తంలో నగదును సమకూర్చుకునే భారం తప్పుతుంది. అయితే క్రెడిట్ కార్డు బిల్లులను ఈఎంఐల్లోకి మార్చుకునే ముందు కనిపించని చార్జీలు ఏమైనా ఉన్నాయా?, ప్రాసెసింగ్ ఫీజులుంటాయా? అన్నది జాగ్రత్తగా చూసుకోవడం మంచిది.

#### బిల్లింగ్ విధానంపై అవగాహన

క్రెడిట్ కార్డు వినియోగదారులు తప్పక తమ క్రెడిట్ కార్డ్ బిల్లింగ్ సైకిల్‌ను తెలుసుకోవాలి. బ్యాంకులు క్రెడిట్-ఫ్రీ పీరియడ్‌ను కల్పిస్తాయి. ఇందులో బకాయిల చెల్లింపునకు 30 రోజుల స్టేట్‌మెంట్ సైకిల్, దానిపై 15 రోజుల గ్రేస్ పీరియడ్ ఉంటాయి. ప్రతి నెలా బిల్లింగ్ సైకిల్ ఏ తేదీన మొదలవుతుందో చూసుకోవాలి. ఆ తేదీ తర్వాత కొంటే మనకు పేమెంట్‌కు ఎక్కువ సమయం ఉంటుంది. ఉదాహరణకు మీ క్రెడిట్ కార్డు బిల్లు డ్యూ డేట్ ఆగస్టు 4న ఉన్నది. ఆ బిల్లు స్టేట్‌మెంట్ జూలై 18న వచ్చింది. అయితే జూలై 19న మీరు మీ క్రెడిట్ కార్డు ద్వారా ఓ వస్తువును కొన్నారు. అప్పుడు అది తర్వాతి బిల్లు స్టేట్‌మెంట్‌లో ఉంటుంది. దాన్నిబట్టి సెప్టెంబర్ 4వరకు మీరు దాని చెల్లింపునకు వ్యవధి ఉంటుందన్నమాట. ఒకవేళ జూలై 17న కొంటే ఆగస్టు 4కల్లా చెల్లించాల్సిందే. రెండ్రోజులు ఆగి కొనడం వల్ల ఇంత లాభం ఉంటుంది. సమయం ఎక్కువగా ఉండటం వల్ల నగదు సర్దుబాటుకు వీలుంటుంది.

#### పర్సనల్ లోన్

క్రెడిట్ కార్డు బకాయిలపై పడే వడ్డీ రేటు కన్నా.. వ్యక్తిగత రుణాలపై పడే వడ్డీ రేటు తక్కువ. కాబట్టి ఎక్కువగా ఉన్న క్రెడిట్ కార్డు బిల్లులను చెల్లించేందుకు పర్సనల్ లోన్ల సహాయం తీసుకోండి. మీ క్రెడిట్ స్కోర్ బాగుంటే వడ్డీ రేటు ఇంకా తగ్గుతుంది. అలాగే మినిమం కంటే ఎక్కువగా క్రెడిట్ కార్డు బిల్లులను చెల్లిస్తే మంచిది. అధిక వడ్డీ బకాయిలను ముందుగా చెల్లించాలి. తక్కువ మొత్తాలను తీర్చడానికే తొలి ప్రాధాన్యత ఇవ్వాలి. అంతకన్నా ముందు అనవసరపు కొనుగోళ్లను తగ్గిస్తే బిల్లుల భారం తగ్గుతుంది.




# రిటైర్మెంట్ ప్లానింగ్ ఇలా..

## ద్రవ్యోల్బణం ప్రభావాన్ని మరువద్దు



రిటైర్మెంట్ కోసం పెట్టుబడులు పెడుతున్నప్పుడు ద్రవ్యోల్బణం ప్రభావాన్ని పరిశీలించడం చాలాచాలా ముఖ్యం. భవిష్యత్తులో ఆయా వస్తూత్పత్తులు, సేవల ధరల్లో చోటుచేసుకునే పెరుగుదలనే ఈ ద్రవ్యోల్బణం సూచిస్తుంది. ఒకవేళ దీన్ని పరిగణనలోకి తీసుకోకుండా రిటైర్మెంట్ పెట్టుబడులు పెట్టినట్టైతే ఆ వచ్చే సొమ్ము పెరిగిన ధరలకే పోతుంది తప్ప.. మీ అవసరాలకు మాత్రం చాలదు. దీనివల్ల మీ పదవీ విరమణ అనంతరం జీవితం కూడా ఆశించిన స్థాయిలో ఆనందంగా ఉండదు. అందుకే ఇప్పటి ద్రవ్యోల్బణం స్థాయి, అప్పటి ద్రవ్యోల్బణం లెక్కల్ని అంచనా వేసి, దానికి తగ్గట్టుగానే పెట్టుబడులకు వెళ్తే లాభదాయకం.

#### పొదుపుపై ధరల దెబ్బ

రిటైర్మెంట్ సేవింగ్స్‌పై ద్రవ్యోల్బణం ప్రభావం నిజంగా చెప్పాలంటే చాలా ఎక్కువే. ఎంతోమంది వృద్ధులు వారి పెన్షన్, రిటైర్మెంట్ ఫండ్స్‌పైనే ఆధారపడి జీవిస్తూంటారు. అయితే పెరిగే ధరలు వారి రిటైర్మెంట్ సేవింగ్స్ వాస్తవ విలువ క్షీణతకు దారితీస్తాయి. దేశంలో ద్రవ్యోల్బణం హెచ్చుతగ్గులు.. సాధారణ వ్యక్తులు, వేతన జీవులనే అధికంగా ప్రభావితం చేస్తుంటాయి. పదవీ విరమణ అనంతరం పెన్షన్ ఆదాయంపై జీవించేవారికీ ద్రవ్యోల్బణం కష్టాలు తప్పవు. అందువల్ల కాబట్టి ముందుగానే ద్రవ్యోల్బణం అంచనాలతో పెట్టుబడులకు దిగితే ఆ ఇబ్బందులను వృద్ధాప్యంలో అధిగమించవచ్చు. లేకపోతే చాలీచాలని ఆదాయంతో సమస్యల్ని ఎదుర్కొనే ప్రమాదం ఉంటుంది.

#### ఇదీ సంగతి..

రిటైర్మెంట్ సేవింగ్స్‌ను ద్రవ్యోల్బణం ఏవిధంగా ప్రభావితం చేస్తుందో చూద్దాం. ఉదాహరణకు.. నేడు మీ ఖర్చులు రూ.5,000లుగా ఉన్నాయి. అయితే 6 శాతం ద్రవ్యోల్బణం ప్రభావంతో భవిష్యత్తులో ఈ ఖర్చు రూ.5,300లకు పెరిగిందనుకుంటే, వచ్చే 30 ఏండ్లలో.. అది దాదాపు రూ.28,700లను తాకగలదు. దీన్నిబట్టి ఒక్కసారి ఆలోచించండి.. మీరు ఈరోజు బాగానే పొదుపు చేస్తున్నామనుకుంటున్న మొత్తాలు, అప్పటికి ఎంతమేరకు మీ ఖర్చుల్ని భరించగలవోనని.

#### అధిక నిధి ఎలా?

ద్రవ్యోల్బణం ప్రభావం నుంచి మీ రిటైర్మెంట్ ఫండ్స్ రక్షణకు ఈ విధంగా ప్రయత్నించవచ్చని కొందరు నిపుణులు సలహా ఇస్తున్నారు. వాటి ప్రకారం..

#### ఈక్విటీల్లో పెట్టుబడులు

ద్రవ్యోల్బణాన్ని మించి ఆకర్షణీయ రాబడులను అందుకోవాలంటే.. స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులను పరిశీలించడం ఉత్తమం. దీర్ఘకాలంలో పెద్ద ఎత్తున ఆదాయం లేదా లాభాలను పొందాలంటే ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్స్ సరి అని చెప్పవచ్చు. నిజానికి స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. అయితే షార్ట్-టర్మ్ ఇన్వెస్టర్లకే ఈ రిస్క్ ఉంటుందని కూడా గుర్తుంచుకోవాలి. రోజూ చూస్తున్న ఒడిదొడుకులు వీరినే ఎక్కువగా ప్రభావితం చేస్తాయి. లాంగ్-టర్మ్ ఇన్వెస్టర్లకు ఇది తక్కువే. అందుకే స్వల్పకాల లక్ష్యాలతో ఈక్విటీల్లో పెట్టుబడులకు దిగవద్దు. అందుకు భిన్నంగా ముందుకెళ్తే.. ద్రవ్యోల్బణాన్ని మేనేజ్ చేసే ఆకర్షణీయ రిటర్న్స్‌ను సొంతం చేసుకోవచ్చు. ఆర్థిక నిపుణుల సలహాలు తీసుకున్నట్టైతే మరింతగా సత్ఫలితాలుంటాయి.

#### పెట్టుబడుల వర్గీకరణ

పెట్టుబడుల వర్గీకరణ వాటికున్న రిస్కుల్ని తగ్గించగలదు. అందుకే మీ పోర్ట్‌ఫోలియోలో రకరకాల పెట్టుబడి సాధనాలను చేర్చుకోండి. నిపుణుల సూచనల ప్రకారం.. స్టాక్స్‌లో 30 శాతం, బాండ్లలో 30 శాతం, రియల్ ఎస్టేట్‌లో 30 శాతం, నగదు-బంగారంపై మిగతా 10 శాతం పెట్టుబడులు పెడితే లాభదాయకంగా ఉంటుంది. ఇలా చేస్తే ఆయా రంగాల్లో ఎదురయ్యే సవాళ్లను అధిగమించవచ్చు. ఒకట్రెండు రంగాల్లో నష్టాలు వాటిల్లినా.. మిగతా రంగాల్లోని లాభాలతో వాటిని భర్తీ చేసుకోవచ్చు. ముఖ్యంగా అధిక ద్రవ్యోల్బణం ఉన్నప్పుడు ఈ పెట్టుబడులు కలిసొస్తాయి. అందుకే ఒకే రంగంపై దృష్టి పెడుతూ అందులోనే మొత్తం సొమ్మును పెట్టుబడిగా పెడితే పెద్దగా వృద్ధికి ఆస్కారం ఉండదు. పైగా సదరు రంగం కుదేలైతే మనమూ మునిగిపోతాం.

#### ఫ్లోటింగ్-రేట్ బాండ్లు, ఫండ్లు

ద్రవ్యోల్బణం అధికంగా ఉన్నప్పుడు స్వల్పకాలంలో మంచి రాబడులను అందుకోవడానికి ఈ ఫండ్లు చక్కగా దోహదం చేయగలవు. సాధారణంగా ద్రవ్యోల్బణం ఎక్కువగా ఉంటే, వడ్డీరేట్లూ ఎక్కువగానే ఉంటాయి. ధరల్ని అదుపు చేయడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) రెపోరేటును పెంచేస్తుంది. దీనివల్ల బ్యాంకుల రుణాలపై వడ్డీరేట్లూ పెరుగుతాయి. ఈ నేపథ్యంలోనే ఫ్లోటింగ్-రేట్ బాండ్లు, ఫండ్లలో ఇన్వెస్ట్‌మెంట్లు లాభదాయకం. కాబట్టి ద్రవ్యోల్బణం ఎక్కువగా నమోదవుతున్నప్పుడు ఈ ఫండ్లలో ఇన్వెస్ట్‌మెంట్లకు దిగితే అదనపు ఆదాయం అందుకోవచ్చు.

#### గుర్తుంచుకోండి

ధరలు పెరుగుతున్నప్పుడు రోజువారీ అవసరాల కోసం పెట్టే ఖర్చులూ పెరుగుతూపోతుంటాయి. దీనివల్ల నెలవారీ బడ్జెట్ తలకిందులవుతూ ఉంటుంది. కనుక ప్రతీ నెలా ఖర్చులు ఏవి? అన్నదానిపై స్పష్టత ఉంచుకుంటే ఎక్కడ అదనపు ఖర్చులుంటున్నాయో గుర్తించవచ్చు. అలాగే మ్యూచువల్ ఫండ్స్, సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ల ద్వారా కూడా పెట్టుబడులకు దిగి స్టాక్ మార్కెట్‌లో ప్రవేశించవచ్చు. సురక్షితమైన పెట్టుబడుల కోసం ఎఫ్‌డీ, ప్రభుత్వ పథకాలు బెటర్. పోస్టాఫీస్ స్కీములూ లాభదాయకమే. ఐటీ మినహాయింపులూ ఉంటాయి.



## పీవోఎంఐఎస్ భళా

**నెలనెలా** ఆదాయాన్ని ఆశించేవారు, సురక్షిత పెట్టుబడులపట్ల ఆసక్తిగలవారు పోస్టాఫీస్ మంత్లీ ఇన్‌కమ్ స్కీం (పీవోఎంఐఎస్)ను పరిశీలించవచ్చు. ఈ కేంద్ర ప్రభుత్వ పథకం ఆకర్షణీయ వడ్డీరేటును అందిస్తున్నది. అక్టోబర్-డిసెంబర్‌కు 7.40 శాతం వడ్డీరేటు వస్తున్నది. ఇతర చిన్నమొత్తాల పొదుపు పథకాల వడ్డీరేట్ల మాదిరిగానే ఈ పీవోఎంఐ స్కీం వడ్డీరేటును కూడా మూడు నెలలకోసారి సవరిస్తారు. ఇక ఈ పథకం కచ్చితమైన రాబడులను మదుపరులకు అందిస్తుంది. డెట్ ఇన్వెస్ట్‌మెంట్ల కంటే అవి ఉత్తమంగానే ఉంటాయి. స్కీం మెచ్యూరిటీ కాలవ్యవధి ఐదేండ్లు. గరిష్ఠంగా రూ.9 లక్షలు పెట్టుబడిగా పెట్టవచ్చు. ఇద్దరు లేదా ముగ్గురితో కలిసి కూడా స్కీంలో చేరవచ్చు. అప్పుడు పెట్టుబడి పరిమితి రూ.15 లక్షలు. ఇక 10 ఏండ్లు దాటిన పిల్లల పేరుతో కూడా స్కీంను తీసుకోవచ్చు.




## అప్రమత్తత అవసరం

**దేశీయ** స్టాక్ మార్కెట్లలో ఒడిదొడుకులు కొనసాగుతున్నాయి. ప్రతికూల పరిణామాల మధ్య మదుపరులు పెట్టుబడుల ఉపసంహరణలకే పెద్దపీట వేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే గత వారం బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 156.61 పాయింట్లు లేదా 0.19 శాతం క్షీణించి 81,224.75 వద్ద నిలిచింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 110.20 పాయింట్లు 0.44 శాతం పతనమై 24,854.05 దగ్గర ఆగింది. ఈ క్రమంలో ఈ వారం కూడా అమ్మకాల ఒత్తిడికే ఎక్కువగా వీలున్నట్టు అంచనా. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) ద్వితీయ త్రైమాసికానికి (జూలై-సెప్టెంబర్)గాను కార్పొరేట్ కంపెనీలు ప్రకటించే ఆర్థిక ఫలితాలు గత వారం మాదిరే ఈ వారం కూడా మార్కెట్ ట్రేడింగ్‌ను ప్రభావితం చేయనున్నాయి మరి. అందుకే మదుపరులు అప్రమత్తంగా ఉండాలని, ఇన్వెస్ట్‌మెంట్లపై ఆచితూచి స్పందించడం ఉత్తమమని మెజారిటీ ఎక్స్‌పర్ట్స్ అభిప్రాయం. ఇక గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిస్థితులు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఎప్పట్లాగే ఈసారీ భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. సెల్లింగ్ ప్రెషర్ భారీగా ఉంటే నిఫ్టీకి 24,500 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 24,300 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 25,300-25,500 మధ్యకు వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

#### గమనిక..

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.